www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 11 జూన్ 2024
5
అన్నమయ్య



ఘనంగా 'పైడిమర్రి' జయంతి వేడుకలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి వేడుకలను సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వ హించారు. స్థానిక తరిగొండ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో పైడిమర్రి వెంకట సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ భారతదేశం నా మాతృభూమి అనే ప్రతిజ్ఞ ద్వారా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరి గుండెల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతను,సమగ్రతను చాటిచెప్పిన మన తెలుగువాడు పైడిమర్రి అని కొనియాడారు.. ప్రతిజ్ఞ గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమామంజుల, అధ్యాపకులు లోకనాథం, బాబాజాన్, విద్యార్థులు పాల్గొన్నారు.



పైడిమర్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



- విత్తనం, ఎరువుల కొనుగోలు పనుల్లో రైతులు నిమగ్నం
- ఈ ఏడాది సాగు పెంచేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు దుక్కులు చేపట్టి పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు సేకరణ వంటి పనులు చేపడుతున్నారు. పసుపు సాగు చేసే రైతులు విత్తన సేకరణ, ఎరువుల కొనుగోలు రుణాల సేకరణ వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. అధికార యంత్రాంగం కూడా సంసిద్ధమైంది. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసింది. రసా యనిక ఎరువులు, విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించేందుకు జిల్లా వ్యవసా యాధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మరోవైపు గత ఖరీఫ్ కంటే ఈసారి సాగు పెంచేలా రైతులను ప్రోత్స హిస్తున్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్పులు చేర్పులు జరగవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. రెండేళ్ల కిందట జిల్లాలో భారీ వర్షాలు కురవ డంతోపాటు జిల్లాలోని అన్ని సాగునీటి వనరులను ప్రభుత్వం కృష్ణాజలాలతో నింపింది. మరోవైపు భూగర్భ జలాలు పైకి చేరడంతో వేలాది బోరు బావుల్లోనూ పుష్కలంగా నీరు చేరింది. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు పూర్తిగా తగ్గింది. ప్రస్తుతం సీజన్‌లో వర్షాలు ప్రారంభం కావడంతో గతంతో పోలిస్తే ఈ ఏడాది సాగు మరింత పెరగనుంది.

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగును మరింత పెంచాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పులి వెందుల, మైదుకూరు, కమలాపురం, జమ్మ లమడుగు తదితర ప్రాంతాలలో వేరు శనగ, వరి, శనగ తదితర పంటలు సాగు చేస్తారు. మైదుకూరు, ప్రొద్దు టూరు, కమలాపురం, బద్వేలు, కడప తదితర ప్రాంతాల్లో వరితోపాటు పసుపు, మిరప, పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలను సాగు చేస్తారు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో పండ్ల తోటలతోపాటు వరి, చెరుకు, మా మిడి, వేరుశనగ, సన్‌ఫ్లవర్, ఇతర కూరగాయల పం టలు విరివిగా సాగు చేస్తారు. 2019 ఖరీఫ్‌లో 73,792 హెక్టార్లలో పంటలు సాగు కాగా, 2020 ఖరీఫ్‌లో 1,10,127 హెక్టార్లలో, 2021-22 ఏడాదుల్లో 1,24,000 హెక్టార్లలో పంటలు సాగ య్యాయి. 2023 లో సాగు గణ నీయంగా తగ్గి ంది. 70వేల హెక్టార్లకే పరి మితమైంది. ఈ ఏడాది సాగును మరింత పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

68,756 క్వింటాళ్ల పంపిణీకి చర్యలు..

ఖరీఫ్‌లో 68,756 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందిస్తు ఒదన్నారు. ఇందులో ప్రధానంగా 14,602 క్వింటాళ్లు కేబీ రకం, వేరుశనగ విత్తనాలు, 1500 క్వింటాళ్లు నారాయణి రకం, 1000 క్వింటాళ్లు టీఏజీ - 24 రకం విత్తనాలు, అలాగే 950 క్వింటాళ్ల మినుములు, 692 క్వింటాళ్లు ఎల్‌బీజీ - 752 రకం మినుము విత్తనాలు, 418 క్వింటాళ్లు పీబీజీ - 104 రకం విత్తనాలకు ప్రతిపాదనలు పంపారు. వీటితోపాటు 39,870 క్వింటాళ్లు శన గలు, 4780 క్వింటాళ్ల జీలుగ, 463 క్వింటాళ్ల జనుము, 80 క్వింటాళ్ల పిల్లి పెసర తదితర విత్తనాలను పంపిణీ చేస్తు న్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఏటా 2,98,673 మంది రైతులకు ఆర్థికసాయం అందిస్తుండగా, సున్నా వడ్డీ పంట రుణాల కింద 90,000 మందికి సుమారు రూ. 50 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇక పంటల బీమా కింద 2,89,922 మందికి రూ. 777.50 కోట్లు లబ్ధి చేకూరింది. మరోవైపు తగిన మేర సబ్సిడీ విత్తనాలను ప్రభుత్వం అందిస్తోంది. ఖరీఫ్ సాగు 1.35 లక్షల హెక్టార్లపైనే గత ఏడాది ఖరీఫ్‌లో 70వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగ య్యాయి. ఈ సంవత్సరం దీన్ని1,35,100 ఎకరాలకు పైగా పెంచాలన్నది లక్ష్యం. ప్రధానంగా 33,994 హెక్టార్లలో వరి, 23,698 హెక్టార్లలో పత్తి, 23,149 హెక్టార్లలో వేరుశనగ, 3,578 హెక్టార్లలో కంది, 2563 హెక్టార్లలో సన్‌ఫ్లవర్, 2,603 హెక్టార్లలో శనగ, 177 హెక్టార్లలో పెసర, 276 హెక్టార్లలో జొన్న, 43 హెక్టార్లలో చెరకు, 2828 హెక్టార్లలో పసుపు, 4833 హెక్టార్లలో ఉల్లిగడ్డలు, 948 హెక్టార్లలో చీనీ, 1754 హెక్టార్లలో టమాటా తదితర పంటలను సాగు చేయించాలన్నది లక్ష్యం. మొత్తంగా 1,35,100 హెక్టార్లలో ఖరీఫ్ సాగును అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

సాగుకు ఏర్పాట్లు చేస్తున్నాం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి పంట సాగుకు ఏర్పాట్లు చేపడుతున్నాం. ఇప్పటికే జీలగ విత్తనాలు సేకరించాం. దుక్కులు చేపట్టి సేంద్రియ ఎరువులు పంట పొలాల్లో చల్లకాలు చేశాం. జులై రెండవ వారంలో వరి నారు సాగు చేసేందుకు విత్తన సేకరణలో ఉన్నాం. వ్యవసాయ పనులకు అవసరమైన ఖర్చులకోసం బ్యాంకులో రుణాలు రెన్యువల్ చేసుకుంటున్నాం.

- లక్ష్మిరెడ్డి, రైతు, అయ్యవారిపల్లి,చాపాడు.

బ్యాంకు రుణాలు సిద్ధం చేసుకుంటున్నాం

ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల సేకరణలో బ్యాంక్ రుణాలు కోసం తిరుగుతున్నాం. ప్రస్తుతం బ్యాంకులో పాత బకాయిలు చెల్లించి నూతనంగా రుణం పొందేందుకు ఏర్పాటు చేసుకుంటున్నాం. విత్తనాలు, ఎరువులు సేకరించాలంటే నగదు సిద్ధంగా ఉంచుకోవాలి. గత ఏడాది వరి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాం. ప్రస్తుతం ఇతర పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో తిరిగి వారి సాగుకు చర్యలు చేపడుతున్నాం.

- ఆంజనేయులు, రైతు, ఖాదర్‌పల్లె.



సేంద్రియ ఎరువు సేకరిస్తున్న రైతు

బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లాను బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బాలకార్మికుల నిర్మూలనపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను కార్మికులుగా మార్చకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఇందుకోసం అధికారులు హోటళ్లు, పరిశ్రమలు, మెకానిక్ షాపులలో తరచూ తనిఖీలను నిర్వహిస్తూ బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 30 వరకు జిల్లాలో బాల కార్మికులను గుర్తించి వారిని రీహ్యాబిటేషన్ చేయడంతో పాటు బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనకు మండల స్థాయి కమిటీలు నిర్వహించి హోటళ్లు, పరిశ్రమలలో తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. హోటళ్లలో బాల కార్మికులు పని చేస్తున్నారో లేదో తనిఖీలు నిర్వహించి రిపోర్టు ఇవ్వాలని పేర్కొన్నారు. చిన్న, చిన్న ఫ్యాక్టరీలు, గ్రైనైట్స్ తయారీ, ఇటుకుల బట్టీ తయారీలో బాల కార్మికులు ఉంటే వెంటనే సంబందిత యాజమాన్యంపై కేసులు నమోదు చేయించాలని ఆదేశించారు. బడి మానేసి పనులకు వెళుతున్న పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టాలని జిల్లా విద్యా శాఖధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఒకటి నుంచి 18 సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లలందరూ పూర్తి సమయం పాఠశాలల్లో ఉండే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో బాల కార్మికుల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాల కార్మికుల నిర్మూలనపై కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా లేబర్ ఆఫీసర్ రంగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఉచిత తాగునీటి సరఫరా పునఃప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన



ఆర్ఒ ప్లాంట్ నుంచి తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంలో ఆర్ఒ ప్లాంట్ల నుంచి ఉచిత తాగునీటి సరఫరా పునః ప్రారంభమైంది. స్థానికంగా కొన్ని 'ఆర్ఒ ప్లాంట్ల నుంచి అందని తాగునీరు' అనే శీర్షికన ప్రజాశక్తిలో ఆదివారం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందన లభిం చింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసిపికి ఓట్లు వేయ లేదన్న అనుమానం, కోపంతోనే ఆ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉచిత నీటి పంపిణీని అడ్డుకుం టున్నారన్న అనుమానాలు, ఆరోపణలు స్థానికుల నుంచి వ్యక్తమయ్యాయి. పట్టణ పరిధిలోని సుమారు 23 ఉచిత శుద్ధ నీటి పంపిణీ కేంద్రాల్లో కొన్ని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఎంపీ లాడ్స్‌లో ఏర్పాటు చేసినవి కాగా, మరికొన్ని జడ్పీ నిధుల నుంచి జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ ఏర్పాటు చేయించినవి, ఇంకొన్ని గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నవి. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా వీటి ద్వారా ఉచిత శుద్ధ నీరు నిర్విరామంగా వినియోగదారులకు అందిస్తూ వచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిలకు స్థానిక ప్రజలు ఓట్లు వేసి మెజార్టీ అందివ్వలేదన్న అనుమానంతో ఎంపీ లాడ్స్‌తో ఏర్పాటు చేసి, కాంట్రాక్టర్ పర్యవేక్షణలో నడుస్తున్న కొన్ని శుద్ధ నీటి ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయన్న కారణాలు చూపుతూ అక్కడ పనిచేసే సిబ్బంది కొన్ని రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశారని, స్థానికులు ఆరోపించారు. స్పందించిన సర్పంచ్ షేక్ జీనత్ షఫీ వెంటనే స్పందించి, ఆర్ఒ ప్లాంట్లలో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశమై యుద్ధ ప్రాతిపదికన ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఎంపీ గ్రాండ్స్ ద్వారా ఏర్పాటుచేసిన ఆర్ఒ ప్లాంట్లలో పనిచేస్తున్న సిబ్బందికి సంబంధిత గుత్తేదారు నుంచి మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో సిబ్బంది ఆర్ఒ ప్లాంట్ల నుంచి ఉచిత తాగునీరు పంపిణీ నిలిపివేసినట్లు తెలిసింది.



డాక్టర్‌తో మాట్లాడుతున్న విచారణాధికారులు

ఆరోగ్య కేంద్రం సిబ్బందిపై విచారణ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గత వారం ఆశా వర్కర్‌ను ఎఎన్ఎం వేధించడంతో ఆమె వాస్మాయిల్ తాగి బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించడంతో సోమవారం వాల్మీకి స్ట్రీట్ పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బందిపై అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డిపిఎంఒ) డాక్టర్ రియాజ్ బేగ్, డిఎన్ఎంఒ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి విచారణ నిర్వహించారు. విధి నిర్వహణలో పర్యవేక్షకులు, ఎఎన్ఎంలపై వచ్చిన ఆరోపణలపై విచారించి సాధారణ విధి నిర్వహణలో వారు నిర్వర్తించిన విధులకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. విడి విడిగా వారితో మాట్లాడి వారి సంజాయిషీలను నమోదు చేసిన అనంతరం వైద్యాధికారి డాక్టర్ కీర్తి అభిప్రాయం కూడా తీసుకున్నారు. దీనిపై న్యాయపరంగా డిఎంహెచ్ఒకు తదుపరి చర్యల నిమిత్తం సమర్పించనున్నామని చెప్పారు.

విత్తన నిల్వ కేంద్రం సిద్ధం

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక వెలుగు కార్యాలయం సమీపంలో ఉన్న ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ విత్తనాలు కాయలను నిల్వ చేయడానికి రూ.15 లక్షల వ్యయంతో షెడ్‌ను నిర్మించినట్లు ఉద్యాన శాఖ అధికారి నాగమణి పేర్కొన్నారు. మండలంలోని 17 పంచాయతీల్లో ఉన్న ఉన్న రైతులు పండించిన పంటలకు సంబంధించి విత్తన కాయలు ఇక్కడకు తీసుకొచ్చి నిల్వ ఉంచుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. గ్రామాలలో రైతులు వర్షానికి తడవకుండా ఎండకు ఎండకుండా వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు భద్రపరచుకోవచ్చన్నారు.



ర్యాలీ నిర్వహిస్తూ.. అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బిసిజి టీకాతో క్షయ వ్యాధి నివారణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఆరు వర్గాల వారు తప్పనిసరిగా టిబి వ్యాధి రాకుండా బిసిజి టీకాను వేయించుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సి పరిధిలోని జర్రావారిపల్లిలో బిసిజి టీకాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా టిబి మరణాల తీవ్రతను నివారించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు టీకాపై అపోహలకు పోకుండా టీకా వేయించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, వైద్య సిబ్బంది మల్లీశ్వరి, ఆదిలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం అద్భుతమైన ఘట్టం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామాపురం

ధర్మానికి, అధర్మానికి జరిగిన మహా ఘట్టమే మహాభారత యజ్ఞం అని రాయచోటి శాసనసభ్యులు రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆయన సోమవారం రామాపురం మండలంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మద్దిరేవుల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాభారత యజ్ఞానికి ముఖ్య ఆహ్వానితుడిగా విచ్చేసి పంచ పాండవుల ద్రౌపతి విగ్రహాలకు పూజలు నిర్వహించి కొబ్బరికాయలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ వరుసగా మహాభారత యజ్ఞం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మహాభారతం జరిగే గడ్డ పాడిపంటలతో సుఖశాంతులతో ఎప్పుడు హెచ్చిల్లుతుందని ఆయన అభివర్ణించారు.

ఆకట్టుకున్న మహాభారతం హరికథ

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక వెంకటేశ్వర ఆలయానికి ఎదురుగా ఉన్న మైదానంలో సోమవారం నిర్వహించిన మహాభారతం హరికథ పలువురిని ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మొదటి రోజు సర్పయాగం ఘట్టాన్ని తిరుపతి వాస్తవ్యురాలు గాన కోకిల డి.వరలక్ష్మి తన ఆట, పాటలు, మాటలతో పలువురిని ఆకట్టుకున్నారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలోనూ హరికథ కాలక్షేపాలపై ప్రజలు ఆకర్షితులవుతున్నారు. మహాభారతం హరికథను వినడానికి చాలా మంది ప్రేక్షకులు, కళాభిమానులు విచ్చేశారు. కార్యక్రమంలో పెద్దరాజా, హార్మోనిస్టు పార్థసారధి స్వామి, ఆపరేటర్ చిన్న, తబలిస్ట్ బత్తులరెడ్డి, వెంకటేష్, సాసవల చిన్నమ్మ, కళాకారుడు నాగార్జున నాయుడు, ప్రజలు పాల్గొన్నారు.



మహాభారత యజ్ఞంలో సర్పయాగాన్ని వివరిస్తున్న గాన కోకిల వరలక్ష్మి

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - గాలివీడు

ప్రతి ఏడాదీ వేసవిలో గ్రంథాలయ వేసవి శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గత నెల 15 నుంచి ఈనెల 10 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. చివరి రోజు లైబ్రరీన్ రామచంద్రనాయక్ విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తే వారిలో పోటీతత్వం పెరుగుతుందని పేర్కొన్నారు.

జెఇఇలో మెరిసిన విష్ణువర్ధన్

ప్రజాశక్తి-రామాపురం

ఆదివారం విడుదల చేసిన 2024 జెఇఇ అడ్వాన్స్ ఫలితాలలో బొందల విష్ణువర్ధన్ ఆల్ ఇండియా ఒబిసి కేటగిరిలో 207వ ర్యాంకు సాధించి తన సత్తా చాటుకున్నారు బి విష్ణువర్ధన్ అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నల్లగుట్ట పల్లి గ్రామం కొత్తపల్లికు చెందిన బొందల విశ్వనాథ్ (టీచర్) సతీమణి బొందల నాగరత్నల చిన్న కుమారుడు విష్ణువర్ధన్. చిన్ననాటి నుంచి తన ప్రతిభను కనపరుస్తూ జెఇఇలో అద్భుత ఫలితాలు సాధించారు. విష్ణువర్ధన్ ఒకటో తరగతి నుంచి ఆరవ తరగతి వరకు రాయచోటి రాజు స్కూల్లో, ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విజయవాడ చైతన్య హైస్కూల్లో, ఇంటర్ నారాయణ కాలేజీలో విద్యనభ్యసించి జెఇఇ అడ్వాన్స్ ఫలితాలలో ఆలిండియా బిసి కేటగిరిలో 207 ర్యాంక్ సాధించి అటు తల్లిదండ్రులను తను చదువు అభ్యసించిన ఉపాధ్యాయులకు ఆనందానికి గురి చేశారు



తల్లిదండ్రులతో విష్ణువర్ధన్

ఏకపక్షంగా పోలీసుల వ్యవహారం : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి సబ్‌జైల్లో ఉన్న వైసిపి కార్యకర్తలను ఆయన పరామర్శించారు. రాయచోటి రూరల్ మండలం యండపల్లె గ్రామంలోని బోయపల్లెలో ఇటీవల చోటు చేసుకున్న ఘర్షణలో16 మందిని రిమాండ్‌కు పంపారు. వారిని సోమవారం రాయచోటిలోని సబ్ జైల్‌లో శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బోయపల్లె సంఘటనలో ఇద్దరు, ముగ్గురు భాగస్వామ్యులైతే 16 మందిపై 307 సెక్షన్లు పెట్టడం చాలా దారుణమన్నారు. మాజీ మండలాధ్యక్షుడు పోలు సుబ్బారెడ్డికి చెందిన కారు, ఇల్లు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్నికల్లో వైసిపి తరపున ఏజెంట్లుగా కూర్చున్నారన్న నెపంతో ఎటువంటి సంబంధం లేని వారిని ఈ కేసులో ఇరికించారన్నారు. అందులో బయట ఉద్యోగాలు చేసుకునే వారిపైనా, అమాయకులపైనా, ఎటువంటి సంబంధంలేని వారిపైనా కేసులు నమోదు చేయడం చాలా బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తామని అయన భరోసా ఇచ్చారు.

గెలుపోటములు సహజం : 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఎన్నికలలో గెలుపోటములు సహజమని వైసిపి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయంత్రం వైసిపి కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లా డుతూ ఎన్నికలలో ఓటమి చెందినందుకు కార్యకర్తలు అధైర్య పడవద్దని తెలిపారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకుంటామని తమ ప్రభుత్వంలో ఐదేళ్ల ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే చేర్చామని పేర్కొన్నారు. ఇటీవల తాము చేపట్టిన అభివృద్ధి పనులను ఎన్‌డిఎ ప్రభుత్వం కొనసాగించి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు స్వేచ్ఛని ఇవ్వాలని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కొత్త ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల వరకే రాజకీయాలని అనంతరం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, సుధాకర్ రాజు, సర్పంచ్‌లు దార్ల చంద్రశేఖర్ హరికృష్ణారెడ్డి, రామకృష్ణ, సుబ్రమణ్యంరాజు, గోపి, కవిత, చెంగల్‌రెడ్డి, రమణారెడ్డి, ఆకేపాటి రగారెడ్డి, రవీంద్రారెడ్డి, ఆర్‌వి రమణ, ఎంపిటిసి మల్లి, సిహెచ్ రమేష్, ఎం.శివయ్య, అబ్దుల్ సలాం, డి.రాజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కొత్తపల్లి రాజా, రాజేశ్వరి, అరుణ, పుష్పలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు



నాదెండ్ల మనోహర్‌తో ముక్కా, ఎమ్మెల్యే శ్రీధర్, సాయి

'నాదెండ్ల'ను కలిసిన 'ముక్కా', ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

జనసేన పార్టీ రాష్ట్ర వ్యవహారాల కమిటీ చైర్మన్, తెనాలి శాసభసభ్యులు నాదెండ్ల మనోహర్‌ను రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి, రైల్వేకోడూరు జనసేన శాసనసభ్యులు అరవ శ్రీధర్ తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికలలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేను ఓడించి జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను గెలిపించి మాట నిలబెట్టుకున్నామని రూపానందరెడ్డి మనోహర్‌కు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగేంద్ర, నరసింహరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గౌతమ్‌రాజు, జోగినేని మణి, పగడాల చంద్రశేఖర్, వెంకటేష్, నాగరాజా కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

13న బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల13వ తేదీన స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి నూర్జహాన్ పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. సమావేశానికి ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మానసిక ప్రశాంతత కోసం ఎగ్జిబిషన్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానసిక ప్రశాంతత కోసం ఎగ్జిబిషన్‌లు దోహద పడుతాయని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా వ్యాఖ్యానించారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డు ఉన్న బి.టి.కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఫారిన్ సిటి ఎక్సిబిషన్‌ను ఆదివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వినోదం, అహ్లాదం అందించేందుకు ఎక్సిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ ఎక్సిబిట్స్‌ను చూసిన ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. 40 రోజుల పాటు మదనపల్లె ప్రజలకు వినోదం అందించడం కోసం ఎక్సిబిషన్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులు శంకర్, మూర్తిలను ఎమ్మెల్యే అభినందించారు. పట్టణ ప్రజలు ఎగ్జిబిషన్‌ను ఉపయోగించుకుని మానసిక ప్రశాంతత పొందాలని ఆకాంక్షించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - పుల్లంపేట

మంగళవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కొన్ని అనివార్య కారణాలవల్ల వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిపితో చర్చించిన తరువాత తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల అధికారులు గమనించాలని కోరారు.

కళామండలి అధ్యక్షులుగా శివశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



మల్లయ్య కొండ శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి కళామండలి అధ్యక్షులుగా కురుబలకోట మండలం అడవి పల్లెకు చెందిన శివ శంకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని కళాకారులందరూ మల్లయ్య కొండపై కళాకారుల ఆధ్వర్యంలో మల్లయ్య కొండపై సమావేశమయ్యారు. కళామండలి అధ్యక్షులుగా శివశంకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళామండలి, కళాకారుల సంక్షేమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

'మండిపల్లి' గెలుపు అభివృద్ధికి మలుపు

- రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గెలుపు రాయచోటికే మలుపు అని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి గెలుపునకు కృషిచేసిన అన్నమయ్య జిల్లా, రాయచోటి నియోజకవర్గం గిరిజన ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో గెలిచిన ఎమ్మెల్యే అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి అమాస రెడ్డెయ్య మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న గిరిజన ప్రజానీకానికి, పార్టీకి అహర్నిశలు కష్టపడిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, పార్లమెంట్ పరిధిలో గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులకు, అదేవిధంగా రాయచోటి స్థానిక ఎమ్మెల్యే మండలిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో ప్రతి గిరిజన సోదరులకు అన్నివిధాలుగా అందుబాటు లో ఉంటూ ప్రవేశపెట్టబోవు పథకాలన్నింటినీ కూడా గిరిజన సోదరులకు అందేవిధంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. రాష్ట్రంలో, పార్లమెంట్ పరిధిలో అన్నివిధాలుగా గిరిజనులందరూ 80 శాతం ఓటింగ్ కూటమి వైపు మొగ్గుచూపారని అన్నారు. టిడిపి ఎస్‌టి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బి. మీటు నాయక్ మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో గిరిజన సోదరులు వైసిపి ప్రభుత్వం జరిపిన అరాచకాలకు మండపల్లి రాంప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో టిడిపి రాజంపేట నియోజకవర్గం రాష్ట్ర ఎస్‌టి సెల్ నాయకులు కిషోర్ నాయక్, జయరాం నాయక్, నిత్య పూజయ్య, పి.రాము, ఎస్.సునీల్, ఎం. బద్దు నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోహర్ నాయక్

ఆక్రమణలో బస్ షెల్టర్

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువులోని కదిరి రోడ్డులో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌అండ్‌బి అధికారులు బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. బస్సులు షెల్టర్ వద్దకు రాకపోవడంతో సమీపంలో ఉన్న కూరగాయలు అమ్ముకునే వారు దానిని ఆక్రమించుకొని ఏకంగా కూరగాయల అంగడినే పెట్టేశారు. స్థానికంగా ఉండే వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు పలు రకాలుగా చర్చించు కుంటున్నారు. ప్రయాణికులు అయితే ఆగ్రహంతో ఉన్నారు. ప్రయాణికుల కొరకు ఏర్పాటు చేస్తే అందులో కూరగాయల అంగడిని పెట్టడం ఏంటని ప్రయాణికులు ఆగ్రహాన్ని వెలగక్కారు. ఆర్టీసీ యాజమాన్యం, ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ప్రత్యేక చొరవ తీసుకొని బస్సు షెల్టర్ ఏర్పాటు చేసిన స్థలం వరకు బస్సులు రావాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు తక్షణమే స్పందించి కూరగాయలు అంగడిని తొలగించాలని కోరుతున్నారు. అక్కడ అంగళ్లను పెట్టకుండా హెచ్చరించాలని స్థానికులు కోరుతున్నారు.



బస్ షెల్టర్‌లో ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణం

సమస్యాత్మక గ్రామాలపై నిఘా : డిఎస్‌పి



మాట్లాడుతున్న మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

తంబళ్లపల్లి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, గతంలో గ్రామాలలో జరిగిన సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ములకలచెరువు పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మకమైన గ్రామాలలో పోలీస్ ఫికెటింగ్, పూర్తిస్థాయిలో నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. గతంలో పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లుగా నమోదైన వారు ఎలాంటి అల్లర్లు, గొడవలకు వెళ్లకుండా ఉండాలని ఇప్పటికే కౌన్సెలింగ్ నిర్వహిం చినట్లు తెలిపారు. గ్రామాలలో ఎలాంటి చిన్నపాటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే గ్రామస్తులు పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐ తమ్మిశెట్టి మధు, ఎస్‌ఐ తిప్పే స్వాములు పాల్గొన్నారు.

దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

కలకడ: దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాయచోటి డిఎస్‌పి రామచంద్రరావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కలకడ సిఐ కార్యాలయంలో నిర్వహించిన మండలంలోని వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్‌పి మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజంగా ఉంటాయని గెలిచినవారు ఎక్కువని, ఓడినవారు తక్కువని అంచనాలు వేయడం తప్పని ఆయన సూచించారు. ఎన్నికలు ముగిశాయి కాబట్టి గ్రామీణ ప్రాంతాలలో రెచ్చగొట్టే మాటలు కార్యకలాపాలు చేయకుండా అందరూ స్నేహభావంతో సోదర భావంతో గ్రామాల్లో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సహనాన్ని పాటించి ఓర్పుతో నేర్పుతో గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రతి ఒక్కరూ ఘర్షణలకు చోటు ఇవ్వకుండా ప్రవర్తించాలని సూచించినట్టు తెలిపారు. ఎవరైనా గ్రామీణ ప్రాంతాలలో అవాంఛనీయ సంఘటనలు ఘర్షణలకు తావిచ్చే మాటలు చర్యలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోని యువకులు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన కార్యక్రమాలు చేసిన వారికి నచ్చుజెప్పి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మీరు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు కలకడ, కేవి.పల్లి ఎస్‌ఐలు రామకృష్ణారెడ్డి, రహీముల్లా మండలంలోని తెలుగుదేశం, వైసిపి, బిజెపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయచోటి డిఎస్‌పి రామచంద్రరావు.

నేరేడు మేలు అంతా..ఇంతా...కాదు

అల్లనేరేడుకు భలే గిరాకీ
ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
కిలో.150 నుంచి రూ.200
రైతులకు లాభాలనిస్తున్న పంట

ప్రజాశక్తి - రామసముద్రం

ప్రస్తుత సీజన్లో పండ్లలో అధిక డిమాండ్ ఉన్న పండు అల్లనేరేడు పండ్లు ముఖ్యంగా మండలంలో పండే అల్లనేరడు పండ్లుకు మదనపల్లె మార్కెట్‌లో అధిక డిమాండ్ పలుకుతుంది. ఈ ప్రాంతంలో అల్లనేరడు మొక్కలు బాగా పెరగడానికి , అధిక దిగుబడులు రావడానికి, పండు కాంతి రావడానికి, రుచికి ముఖ్య కారణం రేగడి భూముల్లో పండిన కాయలకి కర్నాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ మార్కెట్లలో మంచి ప్రాధాన్యత సంతరించుకుంది. మండలంలోని పలు ప్రాంతాల్లో కొందరు రైతులు కేవలం అల్లనేరడు పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలు అల్లనేరడు చెట్లను కొనుగోలు చేసి కాయలు కోసి ఎక్కువ మంది చెన్నై మార్కెట్లుకు తరలిస్తున్నారు. చెట్లను కొన్న వ్యాపారస్తులు కాయలు కోసే వారికి మరియు కాపలా కాసేవారికి దాదాపు నాలుగు నెలలు జీవనోపాధి కల్పిస్తున్నారు. నేరేడు పండ్లు అత్యధిక ధర పలుకుతున్నాయి. ఎందు కంటే ఆ పండ్లలో ఆరోగ్య రహస్యం దాగి ఉంది. అందుకే అంత డిమాండ్ ఉంది. వైశాఖ మాసంలో పుష్కలంగా లభించే నేరేడు పండ్లు ముందుగానే డివిజన్ వ్యాప్తంగా మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. నేరేడు పండ్లు చేసే మేలు అంతా ఇంతా కాదు. నేరేడు పండ్లలో గ్లైక్‌మిక్ ఇండెక్స్ తక్కువగా ఉండడం వల్ల మధుమేహ వ్యాధికి చక్కగా ఉపయోగపడుతుంది. యాంటీ డయాబెటిక్‌గా పనిచేస్తుందని ఎందరో వైద్యులు చెబుతున్నారు. కాల్షియం, ఐరన్, పొటాషియం,



అల్లనేరేడు పండ్లు

విటమిన్ సి పుష్కలంగా ఉండే ఈ నేరేడుపండు తింటే వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఎముకలు దృడంగా ఉంటాయి. హిమోగ్లోబిన్ స్థాయిని పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. గుండె సంబందిత వ్యాధులను అడ్డుకుంటుంది. నేరేడు చెట్టు ఆకులు, బెరడు, విత్తనాలు ఇన్‌ఫెక్షన్ నివారించేందుకు ఉపయోగపడతాయి. నేరేడుపండు తింటే డయేరియా తగ్గుతుంది. కేన్సర్ రాకుండా చేయడంలో నేరేడు పండు ప్రధాన పాత్ర పోషిస్తుంది. శరీరంలో వేడిని తగ్గించి శక్తిని పెంపొందిస్తుంది. ర్షాకాలంలో జీర్ణావయవాలకు వచ్చే వ్యాధులను నివారించేందుకు ఉపయోగపడతాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.150 నుంచి రూ.200 అల్లనేరేడు పండ్ల ధరలు పెరిగాయి. జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో తోపుడు బండ్లపై వీటిని విక్రయిస్తున్నారు. వినియోగదారులు కూడా వ్యాధి నిరోధక శక్తి ఉన్నందుకు ధర ఎంతైనా కొనేందుకు ఎగబడుతున్నారు. కాస్త వగరుగా ఉన్నా ఆరోగ్యం మెండుగా ఉండడంతో పండ్లు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రతి రోజూ చెంబకూరు గ్రామం నుండి దాదాపు 30 టన్నుల అల్ల నేరేడు పండ్లు వాహనాలలో ఎగుమతి కావడం విశేషం. మదనపల్లి, తంబళపల్లి నియోజకవర్గాలలో విపరీతంగా నేరేడు చెట్లున్నాయి. సాధారణంగా అల్లనేరేడు చెట్టును నాటినప్పటి నుంచి సుమారు నాలుగేళ్లలోపు పంటకు వస్తుంది. ఒక్కో చెట్టు సుమారు 100 కిలోల వరకు చెట్టు పెరుగుదలను బట్టి దిగుబడి వస్తుందని నేరేడు రైతులు అంటున్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ పండ్లు తింటే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పౌరాణికంగాను, ఔషధపరంగా కూడా జంబూ వృక్షానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి నేరేడు పండ్లను తినడం మంచిదని, మూత్ర సంబంధ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు.

వైసిపి కార్యకర్తలపై దాడులకు దిగడం తగదు

- మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి కార్యకర్తలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం వైసిపి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో గెలుపు, ఓటములు సహజమని, అధికారం ఉండటం, లేకపోవడం వంటివి జరుగుతూ ఉంటాయన్నారు. అధికారంలోకి వచ్చిన వారు భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుని, అభివృద్ధి ఏ విధంగా చేయాలో అన్న ఆలోచనతో ఉండాలన్నారు. అలాగాక చాలా ప్రాంతాలలో జరుగుతున్నటువంటి ఘర్షణలు చూస్తుంటే చాలా బాధ కలిగిస్తుందన్నారు. పోలీసులు కూడా తమకు ఎందుకులే అన్నట్లు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. చాలామంది వైసిపి కార్యకర్తలపై కేసులు నమోదు చేసి వేధిస్తుండడం చాలా బాధాకరమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 72 మంది మంత్రులతో ప్రమాణస్వీకారం శుభపరిణామం అన్నారు. కేంద్రంలో బిజెపికి మెజార్టీ రాకపోవడం ఈ రాష్ట్రానికి సువర్ణ అవకాశం అన్నారు. 240 సీట్లు మాత్రమే బిజెపికి రావడం, 32 సీట్లు భాగస్వామ్యుల పై ఆధారపడి ఉండడం ఒక వరం అన్నారు. దీన్ని అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వారిపైన ఉందన్నారు. పోలవరంకు సంబంధించి రూ.1200 వేల కోట్లు రాష్ట్రానికి రావాల్సి ఉందని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జనవరి, ఫిబ్రవరిలో క్కువ పట్టుపట్టడంతో ఒక్క కొలిక్కి వచ్చిందని తెలిపారు. కేంద్రం నుండి నిధులు తెచ్చుకొని రాజధాని నిర్మాణం చేయాలని అన్నారు. ప్రత్యేక హోదా రాష్ట్రానికి చాలా అవసరమన్నారు. టిడిపి గట్టిగా పట్టుబట్టి ప్రత్యేక హోదాను తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాతో రాష్ట్ర అభివృద్ధితో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అవసరమైతే వైసిపికి చెందిన 11 మంది రాజ్యసభ సభ్యులు, నలుగురు పార్లమెంటు సభ్యులు అండగా నిలబడి మద్దతు ఇస్తామన్నారు. తెలుగు రాష్ట్రంలో ఒకరు కేంద్ర మంత్రి పదవి తీసుకున్నారని, వారికి తాను అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక హోదా ఇప్పుడు తీసుకురాకపోతే మరెప్పటికీ రాదని ఆయన గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు, అరాచకాలకు తావు ఉండకూడదనీ ఆయన అన్నారు. అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఇప్పుడు గ్రామాలలో ధ్వంసం చేస్తూ ఎప్పుడూ లేని సంస్కృతిని రాయచోటి నియోజకవర్గంలో టిడిపి వారు తీసుకొస్తున్నారని అంటూ ఆయన విమర్శించారు. కొత్తగా టిడిపికి ఐదు సంవత్సరాలు అవకాశం ఉందని ఎంతైనా అభివృద్ధి చేయండి అంటూ సూచించారు. శిలాఫలకాలను పగలగొట్టడం, వాటికి పచ్చ రంగు రాయడం వంటివి చేయడం దారుణం అన్నారు. వైసిపి కార్యకర్తలు భూములు కబ్జా చేసి ఉంటే స్వాధీనం చేసుకోండని అందుకు తాము కూడా సంపూర్ణంగా సహకరిస్తామని ఆయన అన్నారు. రాయచోటి నియోజకవర్గంలో టిడిపి వారు చేపడుతున్న ఘటనలపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, కౌన్సిలర్ హరూన్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

- కమిషనర్ పి.ఆర్.మనోహర్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. సోమవారం అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులోని పెద్దకాలువను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. మురుగు కాలువలకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కాలువలో పూడికను ఎత్తివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.ఆర్.మనోహర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పట్టణంలో మెరుగైన పారిశుధ్యంపై దృష్టి సారించామన్నారు. ప్రతిరోజు పట్టణంలోని ఏదో ఒక వార్డులో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని పేర్కొన్నారు. దోమలు ఎక్కువగా వృద్ధి చెందకుండా మురుగునీటి కాలువలను శుభ్రం చేసి అందులో బ్లీచింగ్ వేస్తున్నామన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. తాము సరఫరా చేసిన తడి, పొడి చెత్త బుట్టలో చెత్తను విడివిడిగా వేయాలన్నారు.అంటురోగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం సాధ్యం

- డాక్టర్ కిశోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలకడ

ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం సాధ్యమవుతుందని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పిహెచ్‌సిలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణికి మేలైన ఆరోగ్యానికి, శిశువు ఎదుగుదలకు ఆరోగ్య పరీక్షలు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. ప్రతి మహిళకు కాన్పు పునర్జన్మ మాదిరన్నారు. మెరుగైన ఆరోగ్య సేవలు అందిపుచ్చుకుని ప్రతి గర్భిణి సురక్షిత మాతృత్వం అలవర్చుకోవాలి అందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం, మీ ఊర్లో చక్కటి అవకాశమని బరువు, ఎత్తు, అధికరక్తపోటు, మూత్ర, రక్త, మొదలగు వ్యాధుల నిర్ధారణ పరీక్షలు తమ ఆరోగ్య బృందంతో నిర్వహించి అవరమైన వారికి ఐరన్ఫోలిక్యాసిడ్, కాల్షియం, అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి, ఆసుపత్రిలో కాన్పు ఆవశ్యకతను గూర్చి సూచన సలహాలు ఇచ్చారు. మొత్తం గర్భిణులు 45 హాజరు కాగా ఇందులో కష్టమైన గర్భిణులు 8 మందిని గుర్తించి ఉన్నత స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలకు రిఫరల్ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జవహర్ బాబు, ఎంపిహెచ్‌ఇఒ జి.జయరామయ్య, స్టాఫ్ నర్స్ జె.భారతమ్మ పిహెచ్‌ఎన్ సుబ్బరత్న. బండి రెడ్డెమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్ అహ్మద్ ఫార్మసిస్టు షేక్ షరీఫ్ బాషా, ఎఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యాకర్తలు వాణి. పి.శ్రీలక్ష్మి, డి.వరలక్ష్మి. బి లక్ష్మి, ఎస్‌వి.రమణమ్మ సి.లక్ష్మిదేవి, ఎంఎల్‌హెచ్‌పిలు ఎ.రాజసులోచన. బి.అశ్వని. కె.కనకమ్మ. జె.ఎస్.గోపి కృష్ణ, ఎస్.లావన్య, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి

విజయవాడలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌బాబును సోమవారం రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన లోకేష్ బాబుకి ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలియజేశారు. అనంతరం సన్మానించారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలకు అన్ని విధాల ఆదుకుంటామని లోకేష్ బాబు హామీ ఇచ్చినట్లు ప్రసాద్ బాబు తెలిపారు. **రాజంపేట అర్బన్ :**ఉండవల్లిలోని తన నివాసంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ లోకేష్‌ను కలిశారు.టిఎన్ఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉండాలని లోకేష్ సూచించినట్లు తెలియజేశారు.



లోకేష్‌ను అభినందిస్తున్న ప్రసాద్‌బాబు



సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

ఘనంగా సత్యనారాయణరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టంలోని ధరణి హోటల్ ఆవరణలో రెడ్డి సంఘం సభ్యులు, స్నేహితులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలు, పూలమాలలు, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం బలోపేతం, ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆయన అందరికి ఆదర్శంగా ఉన్నారని, భవిషత్తులో ఆత్మవిశ్వాసంతో, తన ఆలోచనతో మంచి నిర్ణయాలు తీసుకొని తన జీవిత గమ్యాన్ని నిర్ధేశిస్తూ, ఉన్నత శిఖరాలు అధిరోహించి, సమాజంలో గొప్ప స్థానం పొందాలని, ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని అందరూ ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, న్యాయవాది రాంప్రసాద్‌రెడ్డి, ఆది పబ్లిక్ స్కూల్ అధినేత ఆదినారాయణరెడ్డి, యర్రంరెడ్డి, పులి ధరణి కుమార్‌రెడ్డి, ప్రసన్న కుమార్ నాయుడు, జనార్ధన్‌రెడ్డి, గండబోయినపల్లి ఎంపిటిసి సత్యరెడ్డి, రాజారెడ్డి, శేష్ కుమార్‌రెడ్డి, జగన్నాథ రెడ్డి, రామిరెడ్డి, గంగిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, అమర నాద రెడ్డి, మోహన, మహేష్, బి.జనార్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, ఆనంద, శ్రీనివాసులురెడ్డి, భీమ రాజు, శంకరమ్మ పాల్గొన్నారు.

వైభవంగా పాలేటమ్మ జాతర

ప్రజాశక్తి-కలికిరి

గుట్టపాలెం గ్రామ దేవత పాలేటి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా మండలంలోని గుట్టపాలెం కసిఫాలో వెలసిన పాలేటమ్మ వారి జాతర శనివారం నుండి అభిషేకాలు, మంగళ హారతులు, అన్నదాన కార్యక్రమం తోపాటు ఆదివారం ఉదయం తేలు బాణాలతో అమ్మవారికి విశేష పూజలు అందించారు. పలు గ్రామాల నుండి 12 చాందిని బండ్లు చెక్కభజనలతో పలువురు భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చారు. కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

రిటైర్డ్ టిటిడి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అనారోగ్యంతో విశ్రాంత టిటిడి ఉద్యోగి గోపి మృతి చెందిన సంఘటన సోమవారం వాల్మీకిపురంలో చోటు చేసుకొంది. వివరాలు.. పట్టణంలోని కొత్తపేటవీధికి చెందిన విశ్రాంత టిటిడి ఉద్యోగి గోపి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతుడు గోపి స్వగృహానికి చేరుకొని, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢసానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతల వెంట చింతల ఆనందరెడ్డి, చింతల శివానందరెడ్డి, కేశవరెడ్డి, నీళ్లభాస్కర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి